క్లుప్తంగా

10న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎస్‌ఈబీ సౌత్ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 8 వాహనాలకు ఈ నెల 10వ తేదీ వేలం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఎస్‌ఈబీ సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ ప్రకటన విడుదల చేశారు. పూర్తి వివరాలకు స్థానిక తిలక్ రోడ్డులోని పాత బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లోని ఎస్‌ఈబీ సౌత్‌స్టేషన్‌లో గానీ, 96187 33879, 91775 82457 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

8న జగనన్నకు చెబుదాం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గోకవరం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. గోకవరంలోని గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



15వ డివిజన్‌లో పర్యటిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: మౌలిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక 15వ డివిజన్ ఇన్‌చార్జి ముత్యాల వీర అప్పారావు ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు విన్న ఆయన మౌలిక సమస్యల పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు సూచించారు. శానిటేషన్ సమస్యలను తక్షణం పరిష్కరించి, డ్రైనేజీలను సక్రమంగా నిర్వహించేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల శివ, మజ్జి రాజు పాల్గొన్నారు.

బాలుడికి పరామర్శ

కడియం: విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడి, చేతిని కోల్పోయిన జేగురుపాడు గ్రామానికి చెందిన వనమాలి చందును సోమవారం ఐఏఎస్ మాజీ అధికారి లక్ష్మీనారాయణ పరామర్శించారు. ఆ బాలుడి తల్లిదండ్రులు అంజికుమార్, సుభద్రతో మాట్లాడారు. చందు కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా నిలబడేందుకు అతడి తల్లితో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు, పలువురు యూత్ సభ్యులు సహాయపడ్డారు. పూర్వ విద్యార్థుల ద్వారా పరిచయం ఉన్న లక్ష్మీనారాయణ కూడా బాలుడి వైద్యం విషయంలో తన వంతు తోడ్పాటు అందించారు. ఈ నేపథ్యంలో బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఆయన జేగురుపాడు వచ్చారు. ఆయన వెంట స్థానిక ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ పాలపర్తి ప్రకాష్ కుమార్ తదితరులు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్టు



నిందితుడితో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ రమణ

రాజమహేంద్రవరం రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బొడ్డు శ్రీనును పేపరు మిల్లు వాంబేకాలనీ వద్ద సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీఎం జగన్ నిర్ణయంపై హర్షం

సీటీఆర్ఐ: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంపై వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. గుర్తింపు కలిగిన జర్నలిస్టులందరికీ త్వరలో జగనన్న ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తుందన్నారు.

1,862 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 28వ రోజు సోమవారం జిల్లా వ్యాప్తంగా మూడు వైద్యశిబిరాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. వీటిలో 1,862 మంది వైద్యసేవలు పొందగా, 20 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు.

వణికిస్తున్న వైరల్ జ్వరాలు

- పెరుగుతున్న బాధితులు
- అప్రమత్తమైన అధికారులు



వార్డుల్లో దోమల నివారణకు చర్యలు చేపడుతున్న వైద్య సిబ్బంది

కంబాలచెరువు: వాతారణ మారింది. శీతల గాలులు ప్రారంభమయ్యాయి. వాటి వెంటే దగ్గు, రొంప, జ్వరాలు వచ్చాయి. ఎవరిని కదిపినా వైరల్ వ్యాధులతో తీవ్రంగా సతమతమవుతున్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యశాఖ, మున్సిపల్ హెల్త్ అధికారులు వాటి నివారణ దిశగా చర్యలు చేపట్టారు. డెంగీ, మలేరియా వ్యాధులపై నగర వాసులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ సమయంలో జాగ్రత్తే ప్రథమ మందని చెబుతున్నారు వైద్య నిపుణులు. రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. అయితే కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు సీజనల్ వ్యాధులపైనా వ్యాపార ధోరణితో రోగుల జేబులను గుల్లచేస్తున్నాయి. డెంగీ, మలేరియా వ్యాధుల పేరుతో రకరకాల పరీక్షలు నిర్వహించడం, ప్లేట్‌లెట్లు బూచితో వారిని మరింత దోచుకుంటున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యాధికారులు వార్డుల్లో ఫీవర్ సర్వే ప్రారంభించారు. దీనిలో సచివాలయం వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటా తిరిగి ఫీవర్ సర్వే చేస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాజమహేంద్రవరం డివిజనలో 67 డెంగీ, ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి.

డెంగీ లక్షణాలు

డెంగీ జ్వరం ఈడిస్ ఈజిప్ట్ దోమ కుట్టడం కారణంగా వస్తుంది. దోమ కుట్టిన 24 గంటల్లో విపరీతమైన తలనొప్పి వస్తుంది. జ్వర తీవ్రత పెరిగే కొద్దీ కళ్లు ఎర్రగా మారుతుంటాయి. కండరాల నొప్పి, కీళ్ల వద్ద నొప్పి తీవ్రంగా ఉంటుంది. ఒళ్లంతా దద్దుర్లులా మొదలై ఎర్రగా మారుతుంటాయి. వాంతులు అవుతాయి.

మలేరియా లక్షణాలు

అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. చలి, వణుకు, జ్వరం ఉంటుంది. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో మలేరియా లక్షణాలు కనిపిస్తాయి. ఆర్‌డీ టెస్ట్ ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే 14 రోజులు పూర్తి చికిత్స తీసుకోవాలి.

నియంత్రణకు చర్యలు



డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. వార్డు సర్వే చేస్తున్నాం. ఇంటింటికీ తిరిగి జ్వరం, దగ్గుతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించి వారికి వైద్య సదుపాయాలు అందిస్తున్నాం. ఇండోర్ స్ప్రేస్ప్రే, ఫాంగింగ్ వంటివి చేస్తున్నాం. ఫ్రైడే డ్రైడే రోజు ఇంటింటికీ తిరిగి దోమలు పెరగకుండా జాగ్రత్తలు చేపట్టే విధంగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో వలంటీర్లు, ఆశ వర్కర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, తూర్పుగోదావరి

అవినీతి రహితంగా ఎల్ఐసీ మనుగడ



ఎస్‌కేఆర్ మహిళా కళాశాల విద్యార్థినులకు ట్రోఫీ అందజేస్తున్న ఎల్ఐసీ అధికారి ప్రసాదరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అవినీత రహిత సంస్థగా ఎల్ఐసీ మనుగడ సాగిస్తోందని రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ భూపతి ప్రసాదరావు అన్నారు. మోరంపూడిలోని జీవిత బీమా సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన విజిలెన్స్ వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించిన పర్సనల్ డిపార్ట్‌మెంట్ సిబ్బందిని అభినందించారు. విజిలెన్స్ వారోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో అవగాహన సభలు నిర్వహించినట్లు పర్సనల్ మేనేజర్ బీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వక్తృత్వం, క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు, ఉద్యోగులకు ప్రసాదరావు చేతుల మీదుగా జ్ఞాపికలు, బహుమతులు ప్రదానం చేశారు. కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా ప్రభుత్వ కళాశాలకు చెందిన విద్యార్థినులకు ప్రత్యేక ట్రోఫీని అందించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ కళ్యాణ్, జీవిత బీమా సంస్థ ఉద్యోగులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాణసంచా స్టోరేజ్ గోడౌన్ల తనిఖీ



బాణసంచా గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు: జిల్లాలోని బాణసంచా స్టోరేజ్ గోడౌన్లు, అమ్మకాలు జరిగే ప్రదేశాలను ఎస్పీ పి.జగదీష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాధేయపాలెం, భూపాలపట్నం గ్రామాల్లో గోడౌన్లను పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో అమ్మకాలు జరిగే ప్రదేశాల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం భద్రత చర్యలు తీసుకుంటున్నారా, లేదా అని ఆరా తీశారు. నిబంధనలు అతిక్రమించి బాణసంచా అక్రమంగా తయారీ, సరఫరా, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు పొందిన వారందరూ నిర్ణీత ప్రాంతంలోనే విక్రయాలు జరపాలన్నారు. షాపుల వద్ద మండే స్వభావం కల్గిన వస్తువులు ఉంచరాదని, నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఎవరైనా రహస్యంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తుంటే 100, 112కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ జగదీష్ కోరారు.

లీజు పట్టాలు ఇవ్వాలని వినతి

ప్రకాశం నగర్: కోటిలింగాలపేట నివాసితులకు లీజు పట్టాలు ఇవ్వాలని కోరుతూ గుర్రం జాషువా ఎస్సీ ఫీల్డ్ లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్టు సంఘం కార్యదర్శి వల్లూరి అరుణ కుమార్ తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 30వ తేదీన జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌ను 19 ఆధారాలు ఉన్న పత్రాలతో సొసైటీ ప్రతినిధులు కలవగా, ఆయన పూర్తిగా పరిశీలించి లీజు పట్టా కోసం తహసీల్దార్‌కు పంపి దర్యాప్తు జరిపి సమస్య పరిష్కరించాలని సూచించారన్నారు. ఇప్పటి వరకూ లీజు పట్టాలు ఇవ్వలేదని, త్వరగా ఇచ్చేలా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



స్వామిని ఊరేగింపుగా తీసుకువెళుతున్న ఆలయ అర్చకులు

సీటీఆర్ఐ: ఉమామార్కండేయేశ్వరస్వామి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ, ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి వీటిని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి స్థానిక అప్సర థియేటర్ వద్ద శ్యామలాంబ దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ప్రత్యేకంగా అలకరించిన రథంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహణాధికారి ఆర్.శ్రీనివాస్, శ్యామలాంబ అలయ కమిటి నిర్వహకులు పాల్గొన్నారు.

సంకల్పయాత్రతో సంక్షేమానికి బాటలు

- ఎంపీ భరత్ రామ్
- ఘనంగా పాదయాత్ర ఆరేళ్ల వేడుకలు



ప్రజా సంకల్పయాత్ర వేడుకల్లో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు



వైఎస్సార్ సీపీ రూరల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర రాష్ట్రంలో సంక్షేమ పాలనకు బాటలు వేసిందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆ యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కటింగ్ నిర్వహించి వేడుకలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయాల సాధన కోసం రాజకీయాల్లో నూతన అధ్యాయానికి జగన్ శ్రీకారం చుట్టారన్నారు. పాదయాత్ర ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రజల జీవన విధానం, వారి కష్టాలు, అవసరాలను స్వయంగా అధ్యయనం చేశారన్నారు. నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాల పేరుతో ఫలాలు అందించాలనే కృత నిశ్చయానికి వచ్చారన్నారు. ప్రజల సంపూర్ణ మద్దతుతో 2019 ఎన్నికలలో ఘన విజయం సాధించి దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని పథకాలు ప్రజలకు అందజేసి దేశం యావత్తూ ఆశ్చర్యపోయేలా పాలన అందజేసిన ఏకైక ప్రజానేత జగన్ ఒక్కరేనన్నారు. రానున్న ఎన్నికలలో సిటీలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించి జగనన్నకు బహుమతి ఇద్దామన్నారు. సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన యాత్రగా చరిత్రలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నాయకులు టీకే విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్ బర్రే కొండబాబు, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, క్లస్టర్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు మానే దొరబాబు, వాకచర్ల కృష్ణ, గూడూరి రాధిక, పిల్లి నిర్మల, నాయకులు హబీబుల్లా ఖాన్, కాటం రజనీకాంత్ పాల్గొన్నారు.

చరిత్రలో చిరస్థాయిగా..

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు నిరంకుశ పాలనను నిరసిస్తూ, ప్రజలకు నేనున్నానంటూ భరోసా ఇస్తూ వైఎస్ జగన్ చేసిన 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. చందన నాగేశ్వర్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు రాజ్యాధికారంలో సింహభాగం వాటా ఇచ్చి సామాజిక మహా విప్లవాన్ని వైఎస్ జగన్ ఆవిష్కరించారని కొనియాడారు. పార్టీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలనే ఎన్నికల మేనిఫెస్టోగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 98 శాతం హామీలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు తాటికొండ విష్ణుమూర్తి, రాజమౌళి, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్
- పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ నియోజకవర్గంలో ఈ నెల 9వ తేదీ నుంచి జరగనున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. సోమవారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు పార్టీ కేంద్ర కమిటీ జారీ చేసిన మార్గదర్శకాలును పాటించాలన్నారు. సచివాలయాల వారీగా షెడ్యూల్ ప్రకారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో పేదరికం గణనీయంగా తగ్గిందని, నీతి అయోగ్ నివేదికలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. సీఎంగా మళ్లీ జగనన్నే అధికారంలోకి వస్తేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కడియం మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, రూరల్, కడియం, డివిజన్ల జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి, రాజమౌళి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర ముస్లిం సంచారజాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షకీలా బేగం, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ట్యాబ్‌లు



సమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత



భవిత ఉప కేంద్రంలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు: జిల్లాలోని భవిత కేంద్రాలలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్యాబ్‌లు అందజేస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్థానిక తాడితోట అంబేడ్కర్ నగర్ నీరుకొండ వెంకట రామారావు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలోని భవిత ఉప కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 19 భవిత కేంద్రాలను ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలలో 6వ తరగతి, ఆపై చదువుతున్న పిల్లలకు, వారికి బోధన చేసే ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందిస్తోందన్నారు. ఈ మేరకు 120 ట్యాబ్‌లను ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందజేస్తున్నామన్నారు. తాడితోట భవిత కేంద్రంలో ఏడు ట్యాబ్‌లను నలుగురు విద్యార్థులకు, ముగ్గురు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లకు అందచేశామన్నారు. వీటిలో పిల్లల కోసం 17 రకాల ఆండ్రాయిడ్ అప్లికేషన్లు ఇన్‌స్టాల్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, జిల్లా సమగ్ర శిక్షా కో ఆర్డినేటర్ కనకబాబు, అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, సమగ్ర శిక్షా అకౌంటు ఆఫీసర్ జె.స్నేహలత పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ నిధికి రూ.5,58,050 అందజేత

సీటీఆర్ఐ: మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా జిల్లా సైనిక సంక్షేమ నిధికి విరాళంగా రూ.5,58,050 సేకరించినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్లో రూ.5,58,050 చెక్‌ను సైనిక్ వెల్ఫేర్ అధికారి డాక్టర్ సత్యప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి సేకరించిన నిధిని అమరవీరుల వికలాంగ సైనికుల కుటుంబాల పునరావాసం, సంక్షేమ పథకాల కోసం వినియోగిస్తారన్నారన్నారు. సాయుధ బలగాల జెండా దినోత్సవ వార్షికోత్సవం ప్రతి ఏడాది డిసెంబర్ 7వ తేదీన దేశమంతటా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మెప్మా పీడీ బి.ప్రియంవద మాట్లడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), నగర పాలక సంస్థ, రెండు మునిసిపాలిటీల స్వయం సహాయక సభ్యులు ఒక్కొక్కరూ. 10 రూపాయల చొప్పున అందచేశారన్నారు. రాజమహేంద్రవరంలో రూ.4,21,350, కొవ్వూరులో రూ.68 వేలు, నిడదవోలులో రూ.68,700 సేకరించామన్నారు.

నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం

ప్రకాశం నగర్: రాష్ట్ర విభజన హామీలకు తూట్లు పొడిచిన నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లోకనాథం అన్నారు. ఆ పార్టీ చేపట్టిన ప్రజారక్షణ భేరి రాష్ట్ర బస్సుయాత్ర సోమవారం జిల్లాలో పర్యటించింది. రాజానగరం వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పలువురు నాయకులు పూలమాలలతో స్వాగతం పలికారు. జాతీయ రహదారి మీదుగా రాజమహేంద్రవరంలోని లాలాచెరువు సెంటర్ చేరుకోగా అక్కడి నుంచి స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ప్రజానాట్యమండలి కళాకారుల డప్పులతో ఉత్సాహ పరిచారు. సెంట్రల్ జైలు రోడ్డు, వై.జంక్షన్, స్టేడియం రోడ్డు మీదుగా శ్యామలా సెంటర్‌లోని సీపీఎం కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అక్కడి నుంచి రెడ్ వలంటీర్లు ఎర్ర జెండాలు చేతబూని కవాతు నిర్వహించారు. సాయంత్రం కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో జరిగిన బహిరంగ సభకు పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం, వి.ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లోకనాథం మాట్లాడుతూ విభజన చట్టాలకు మోదీ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోదీ పాలనలో ప్రతి నిత్యావసర వస్తువు ధర 300 శాతం పెరిగిందన్నారు. 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా గర్జనను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, ఏవీ నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కొల్లాటి శ్రీనివాసరావు, హరిబాబు, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు జె.రాంబాబు, బి.రాజులోవ, టి.తులసి, ఎం.సుందర్ బాబు, సీనియర్ నాయకులు టి.ఎస్.ప్రకాష్, ఎస్.ఎస్. మూర్తి పాల్గొన్నారు.

పేదల ఇంటికే మెరుగైన వైద్యం



ధవళేశ్వరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అనుసూరి పద్మలత

ధవళేశ్వరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఇంటికే మెరుగైన వైద్యం చేరుతోందని, ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అన్నారు. ధవళేశ్వరం సచివాలయం-3 పరిధిలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుసూరి పద్మలత ప్రజలకు వైద్య సేవలను అందించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయమన్నారు. దానిలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. స్పెషలిస్టు వైద్యులు గ్రామాల్లో సేవలందిస్తున్నారన్నారు. శిబిరంలో 631మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 14 మందికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, డాక్టర్లు టి.కల్యాణి కిరణ్మయి, ఎం.స్వాగత్, జి.రోహిత, ఈ.నాగదేవి, జెస్సీ సుప్రియ శిబిరంలో సేవలందించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ టి.కృష్ణ, తహసీల్దార్ చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు పాల్గొన్నారు.